# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు · జాతీయ తెలుగు దినపత్రిక

E69 NEWS



**విలేకరులు కావలెను**

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సప్ నెం:
9959812941-9949356387



PUBLISHED: JANGAON,HYDERABAD | సంపుటి :01 | సంచిక :185 | ఆదివారం 14 జూన్ 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 04 | వెల :05/-


## నిమ్స్ ఆస్పత్రిలో కలకలం

### బాలికపై లైంగిక దాడికి యత్నం




**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** హైదరాబాద్ నగరంలోని నిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో ఓ బాలికపై లైంగిక దాడి కి యత్నించిన ఘటన కలకలం రేపింది. పంజాగుట్ట పోలీసుల వివరాల ప్రకారం.. నిమ్స్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద పనులు చేస్తున్న ఓ కుటుంబం తాత్కాలికంగా నివాసం ఉంటోంది. తల్లిదండ్రులు లేని సమయంలో ఆ కుటుంబానికి చెందిన బాలిక ఒంటరిగా ఉండడాన్ని గమనించిన ఓ వ్యక్తి ఆమెను గదిలోకి తీసుకెళ్లి తలుపులు వేసి లైంగిక దాడికి యత్నించినట్లు సమాచారం.

# స్కూళ్లకు పాఠ్యపుస్తకాలు

## ఈనెల 15లోగా పూర్తిస్థాయిలో పంపిణీ లక్ష్యం

**న్యూస్ డెస్క్, 12 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ చేరవేసే ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఈ ఏడాది విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో విద్యాశాఖ సరికొత్త నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ఇప్పటి వరకు 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు అందిస్తున్న వర్క్ బుక్స్ 2026-27 విద్యా సంవత్సరం 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైతం కొత్తగా వర్క్ బుక్స్ పంపిణీ చేయనున్నారు. అభ్యాసన సామర్థ్యాలు పెరగడానికి వర్క్ బుక్స్ ఉపయోగపడుతాయని భావించిన ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, గురుకులాల్లోని 6 నుంచి 10 తరగతుల




విద్యార్థులు సుమారు 12 లక్షల మంది వరకు ఉంటారు. అయితే వర్క్ బుక్స్ ఈ నెలాఖరు లేదా జులై మొదటివారంలో అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

## విద్యార్థులకు 'బండి' బంపర్ ఆఫర్

### టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు




# పేపర్ లీకేజీలపై రాహుల్ గాంధీ పోరు

### జూన్ 17 నుంచి దేశవ్యాప్తంగా 'విద్యార్థి సదస్సులు'




# రేవంత్ బీజేపీ మనిషా అని అనుమానం..

## ఈటల సంచలన వ్యాఖ్యలు

**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** ధాన్యం కొనుగోళ్లను, ప్రాజెక్టులను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారు అంటూ సీఎం రేవంత్ చేసిన ఆరోపణలపై ఎంపీ ఈటల రాజందర్ స్పందించారు. హైదరాబాద్‌లో ఈటల మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ కార్యకర్త నుండి కేంద్రమంత్రి వరకు రాష్ట్ర అభివృద్ధిని కోరుకుంటాం తప్ప అడ్డుకునేది లేదని చెప్పారు. కాంగ్రెస్ హైకమాండ్ మెప్పు కోసమే రేవంత్ రెడ్డి బీజేపీపై విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ తరహాలోనే రేవంత్ రెడ్డి తమపై, ప్రధానిపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. కేంద్రం రూ.6,300 కోట్లతో రామగుండం ఎరువుల కర్మాగారాన్ని తెరిపించిందన్నారు.

కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ కళను సాకారం చేసింది బీజేపీనే అని వ్యాఖ్యానించారు. ఉప్పల్‌లో కడుతున్న ఫ్లైఓవర్, ఎల్ బీనగర్‌లో కట్టిన ఫ్లైఓవర్, ఆరాంగఢ్ ఫ్లైఓవర్ ఇవన్నీ వచ్చింది కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అని స్పష్టం చేశారు. చేసింది చెప్పుకునే కుసంస్కారం తమకు లేదని మండిపడ్డారు. కేంద్రం ఏం ఇచ్చిందో తెలియాలి అంటే రేవంత్ రెడ్డి చర్లపల్లి రైల్వే స్టేషన్ రావాలని అన్నారు. మీరు మాకు నిధులు ఇస్తున్నారు.. ఇంకా కావాలని ప్రధానిని అడగాలి కానీ విమర్శలు ఏంటని




ప్రశ్నించారు. కేసీఆర్ కూడా రేవంత్ రెడ్డి లానే మాట్లాడాడని విమర్శించారు.

# రీ డెవలప్‌మెంట్‌పై ఫోకస్

# సర్కారు ప్రత్యేక పాలసీ

- పాతబస్తీకి కొత్త రూపు
- చార్మినార్ చుట్టూ మేకోవర్
- వరంగల్ ఫోర్ట్‌కు కొత్త వెలుగు
- ప్రత్యేక అర్బన్ పాలసీ సిద్ధం
- మురికివాడల అభివృద్ధికి ప్రాధాన్యం
- మెట్రోతో పాతబస్తీకి జోష్
- హెరిటేజ్‌తో ఆధునిక అభివృద్ధి
- భవన అనుమతుల్లో సడలింపులు
- యూసీఎఫ్‌కు ప్రతిపాదనలు పంపింపు
- ప్రపంచ నగరాల మోడల్ అధ్యయనం
- హౌసింగ్, కమర్షియల్ జోన్ల విస్తరణ
- అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీకి ప్రణాళిక
- పాత నగరానికి సరికొత్త వైభవం
- ప్రజల జీవన ప్రమాణాలపై ఫోకస్



**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలో ముఖ్యమైన నగరాలైన హైదరాబాద్, వరంగల్ పట్టణాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా అభివృద్ధితోపాటు భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ కోసం ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. వీటితోపాటే ఇప్పటికే ఉన్న హైదరాబాద్ కోర్ సిటీ, పాతబస్తీని సైతం అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని నిర్ణయించింది. ఇప్పటి కే ప్రణాళిక రహితంగా నిర్మితమైన ప్రాంతాలను ప్రణాళిక బద్ధంగా నిర్మించడానికి కసరత్తు చేస్తున్నారు.

ఈ రీ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో జనాభా పెరుగుదల, ఆర్థిక పరమైన అంశాలు, ఆధునీకరణ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలను రూపొందించనున్నారు. అందులో భాగంగానే హైదరాబాద్ పాతబస్తీలోని చార్మినార్ చుట్టూ ఏరియా, వరంగల్‌లోని ఫోర్ట్ ఏరియా చుట్టు ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ప్రణాళికలు, ప్రతిపాదనలను సైతం అర్బన్ చాలెంజింగ్ ఫండ్(యూసీఎఫ్)కు పంపించారు. అయితే వరంగల్ నగరానికి ఇప్పటికే యూసీఎఫ్ ఫండ్స్ వచ్చాయి. చార్మినార్ ప్రాంతానికి చెందిన ప్రతిపాదనలకు యూసీఎఫ్ ఆమోదం రావాల్సి ఉంది. మిగతాది 2 లో..

# హైడ్రా కమిషనర్ కు ఊహించని షాక్

### భారీ జరిమానా విధించిన హైకోర్టు




## సర్ జరిగిన ప్రాంతాల్లో బీజేపీకి పడని ఓట్లను తొలగించారు: కేటీఆర్



తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు  జాతీయ తెలుగు దినపత్రిక

ఆదివారం,
14 జూన్ 2026



## హైడ్రా కమిషనర్ కు ఊహించని షాక్ భారీ జరిమానా విధించిన హైకోర్టు




**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టు ఊహించని షాక్ ఇచ్చింది. ఆయన తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ.. రూ 50 వేల జరిమానా విధించింది. నగర వ్యాప్తంగా చెరువుల పరిరక్షణ, అక్రమ నిర్మాణాల కూల్చివేతలతో వార్తల్లో నిలుస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌పై తెలంగాణ హైకోర్టు నిర్ణయం హాట్ టాపిక్ గా మారింది. ఒక కేసు విచారణకు సంబంధించి కోర్టు ఆదేశించినప్పటికీ సకాలంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకుండా కాలయాపన చేయడంపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణించిన హైకోర్టు, కమిషనర్ రంగనాథ్ కు రూ. 50,000 జరిమానా (కాస్ట్) విధిస్తూ సంచలన తీర్పునిచ్చింది.

సీజే రిలీఫ్ ఫండ్‌కు జమ చేయాలని ఆదేశాలు..

కోర్టుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ, సమాధానం ఇవ్వడానికి పదే పదే గడువు తీసుకోవడం, కాలయాపన చేయడం సరికాదని న్యాయస్థానం ఈ సందర్భంగా మండిపడింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలా వ్యవహరించడం హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రంగనాథ్‌కు విధించిన ఈ జరిమానా మొత్తాన్ని తక్షణమే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) రిలీఫ్ ఫండ్‌కి జమ చేయాలని న్యాయమూర్తి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విభాగాల ఆలస్యంపై కోర్టు తీసుకున్న ఈ కఠిన నిర్ణయం ఇప్పుడు ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వర్గాల్లో , రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## సర్ జరిగిన ప్రాంతాల్లో బీజేపీకి పడని ఓట్లను తొలంగించారు: కేటీఆర్



**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జరిగిన ప్రాంతాల్లో బీజేపీకి పడవన్న ఓట్లు అన్ని తొలగించారని వార్తలు వస్తున్నాయని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. 27 లక్షల మంది తమకు ఓటు హక్కు ఉంది కానీ, తమను తొలగించారని కోర్టులో కేసు వేశారన్నారు. సర్ తెచ్చి వెస్ట్ బెంగాల్‌లో 95 లక్షల ఓట్లు, బీహార్‌లో 65 లక్షల ఓట్లు తీసేశారని ఆరోపించారు. బీహార్ లో లాలూ ప్రసాద్ యాదవ్ గెలుస్తారని అంతా అనుకున్నారని కానీ ఓడిపోయారని అన్నారు. ఓట్లు తొలగించారని కోర్టులో కేసు నడుస్తున్న సమయంలోనే ఎన్నికలు నిర్వహించారని మమతా బెనర్జీ దిగిపోయారని అన్నారు. తమిళనాడులో మాజీ సీఎం స్టాలిన్ సొంత నియోజకవర్గంలో 80 వేల ఓట్లు తొలగించారన్నారు.

అందుకే ఆయన 10 వేల ఓట్లతో ఓడిపోయాడని చెప్పారు. తెలంగాణలో జూన్ 25 నుండి సర్ ను తీసుకువస్తున్నారని మనం జాగ్రత్తగా ఉండాలని వ్యాఖ్యానించారు. అంతే కాకుండా కాంగ్రెస్ లో పదవులు అమ్ముకుంటున్నారని షబ్బీర్ అలీ చెప్పారని, అది వాస్తవం అని అన్నారు. ఆనాడు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కూడా పీసీసీ పదవిని అమ్ముకున్నారని చెప్పారన్నారు. ముఖ్యమంత్రి పదవి కూడా అమ్ముకున్నారు కాబట్టే రాహుల్ గాంధీ ఏం చేయలేని పరిస్థితిలో ఉన్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కూల్చివేతలను మీనాక్షి నటరాజన్ అడ్డుకుందనే కారణంతోనే ఆమె రాజ్యసభ నామినేషన్ రద్దు అయ్యేలా కేసు వివరాలు లీక్ చేశాడని సంచలన ఆరోపణలు చేశారు.

## విద్యార్థులకు 'బండి' బంపర్ ఆఫర్..టెన్త్ విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు



**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అదిరిపోయే శుభవార్త చెప్పారు. గత ఏడాది లాగే ఈ ఏడాది కూడా 'మోదీ గిఫ్ట్' పేరుతో ప్రభుత్వ స్కూళ్లలో 10వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. దీంతో పాటు పేద విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు, టెన్త్ క్లాస్ బోర్డు పరీక్ష ఫీజును కూడా తానే స్వయంగా చెల్లిస్తానని బండి సంజయ్ సంచలన ప్రకటన చేశారు.

సొంత జీతంతో పరీక్ష ఫీజులు?

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లల్లో అత్యధికులు పేద, కార్మిక కుటుంబాలకు చెందినవారేనని, కనీసం పరీక్ష ఫీజు కట్టడానికి కూడా ఇబ్బంది పడే పరిస్థితులను తాను చూశానని బండి సంజయ్ పేర్కొన్నారు. అందుకే తన సొంత జీతం డబ్బుల నుండి నియోజకవర్గంలోని దాదాపు 12 వేల మందికి పైగా టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజు మొత్తాన్ని చెల్లించనున్నట్లు తెలిపారు. అలాగే, దూర ప్రాంతాల నుంచి పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ప్రయాణ కష్టాలను తీర్చేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధులతో వేలాది సైకిళ్లను కొనుగోలు చేసి పంపిణీ చేయనున్నట్లు వివరించారు.

ఒక ఎంపీగా గెలిచిన తర్వాత తన నియోజకవర్గంలోని ప్రభుత్వ స్కూల్ పిల్లల బాధ్యతను ఈ స్థాయిలో భుజానికెత్తుకోవడం దేశంలోనే ఇదే తొలిసారి అని ఆయన అనుచరులు చెబుతున్నారు. మంత్రి తీసుకున్న ఈ నిర్ణయంతో కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్ధిపేట, హన్మకొండ జిల్లాల పరిధిలోని కరీంనగర్ లోక్‌సభ స్థానానికి చెందిన వేలాది మంది పేద విద్యార్థుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

## నిమ్స్ ఆస్పత్రిలో కలకలం.. బాలికపై లైంగిక దాడికి యత్నం

మొదటి పేజీ తరువాయి

అయితే బాలిక కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగా, నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.




ప్రాథమిక విచారణలో నిందితుడు శంభు బండారిగా పోలీసులు గుర్తించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇటీవల ఖమ్మం జిల్లాలో బాలికపై జరిగిన అమానుష ఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో, అదే సమయంలో నిమ్స్ ప్రాంగణంలో మరో బాలికపై లైంగిక దాడి యత్నం జరగడం ఆందోళనకు గురిచేస్తోంది. ఆసుపత్రి ఆవరణలో భద్రతా ఏర్పాట్లపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసులు నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## వాయుసేన విమాన ప్రమాదంలో తీవ్ర విషాదం.. ఐదుగురు రక్షణ సిబ్బంది మృతి



**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** అసోంలోని జోర్‌హాట్ ఎయిర్‌బేస్ వద్ద శనివారం ఉదయం భారత వాయుసేన రవాణా విమాన ప్రమాదం కూలిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర విషాదం నెలకొన్నట్లు తెలుస్తుంది. ఎయిర్‌బేస్‌లో ల్యాండింగ్ అవుతున్న సమయంలో వాయుసేనకు చెందిన ఏఎన్-32 రకం విమానం ఒక్కసారిగా కూలిపోవడంతో జరిగిన ఘోర ప్రమాదంలో ఐదుగురు రక్షణ సిబ్బంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారని, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి.

మృతుల్లో ఇద్దరు ఉన్నతాధికారులు

ఈ ప్రమాదంలో మరణించిన వారిలో ఇద్దరు వాయుసేన అధికారులు కాగా, మిగిలిన ముగ్గురు ఇతర విమాన సిబ్బంది ఉన్నట్లు తెలుస్తుంది. అలాగే ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మరొక సిబ్బందిని రెస్క్యూ టీమ్స్ తక్షణమే సమీపంలోని సైనిక ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రస్తుతం బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రన్‌వేపై ల్యాండైన తరుణంలో సాంకేతిక లోపం తలెత్తడం వల్లే విమానం అదుపుతప్పి కూలిపోయి, మంటల్లో చిక్కుకుందని ప్రాథమిక నివేదికలు తెలుపుతున్నాయి. ఈ ప్రమాదంపై పూర్తి స్థాయి విచారణకు వాయుసేన ఉన్నతాధికారులు కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించారు. కాగా ఐదుగురు రక్షణ సిబ్బంది మృతిపై వాయుసేన అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.

## పేపర్ లీకేజీలపై రాహుల్ గాంధీ పోరు జూన్ 17 నుంచి దేశవ్యాప్తంగా 'విద్యార్థి సదస్సులు'



**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** భారత పార్లమెంటులో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పేపర్ లీకేజీ ఘటనలపై దృష్టి సారించారు. త్వరలో కీలక రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనుండటంతో బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు ప్రారంభించిన రాహుల్ గాంధీ.. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు సరికొత్త కార్యాచరణను ప్రకటించారు. ఈ మేరకు లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా భారీ ఎత్తున 'విద్యార్థి సదస్సులను' నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ వెల్లడించారు. నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల లీకేజీల వల్ల నష్టపోయిన లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగ అభ్యర్థులు, విద్యావేత్తలు, యువజన సంఘాలను ఒకే తాటిపైకి తీసుకురావడమే ఈ దేశవ్యాప్త ఉద్యమం యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆయన స్పష్టం చేశారు.

చాశ్రీంశీ =ఘుం – ఆ సమయంలో బట్టల సువాసన.. మీ ఆరోగ్యాన్ని దెబ్బతీయవచ్చు!

కోటా నుంచి ఢిల్లీ వరకు షెడ్యూల్ ఖరారు..

రాహుల్ గాంధీ నిర్వహించబోయే ఈ భారీ విద్యార్థి సదస్సుల షెడ్యూల్‌ను కేసీ వేణుగోపాల్ అధికారికంగా విడుదల చేశారు.

జూన్ 17: కోచింగ్ హబ్‌గా పేరుగాంచిన రాజస్థాన్‌లోని కోటా లో మొదటి భారీ సదస్సు ప్రారంభం కానుంది.

జూలై 10: ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్ (ప్రయాగ్‌రాజ్) లో రెండవ సదస్సు జరుగుతుంది.

జూలై 11: బీహార్ రాజధాని పాట్నా లో మూడవ విద్యార్థి మహాసభను నిర్వహిస్తారు.

జూలై 14: దేశ రాజధాని న్యూఢిల్లీ లో ముగింపు సదస్సు భారీ ఎత్తున జరగనుంది.

యువత ఆకాంక్షల రక్షణే లక్ష్యం..

యువత యొక్క భవిష్యత్తు అవినీతి, ప్రభుత్వ అసమర్థతకు బలికానివ్వకూడదనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ ఈ నిర్ణయం తీసుకున్నారని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ క్యాంపెయిన్‌లో భాగంగా ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, స్థానిక కాంగ్రెస్ కమిటీలు దేశవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు, కోచింగ్ సెంటర్లు, పాఠశాలల్లో విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమవుతాయని వివరించారు. నీట్ పరీక్షల వికేంద్రీకరణ, పరీక్షల ఫీజుల రద్దు, పేపర్ లీక్ ముఠాలపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలనే డిమాండ్లను ఈ సదస్సుల ద్వారా వీధుల్లోకి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు.

## రేవంత్ బీజేపీ మనిషా అని అనుమానం.. ఈటల సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి



రేవంత్ రెడ్డి మోడీని కలిసినప్పుడు ఒకలా ఢిల్లీకి వెళ్లొచ్చిన తరవాత మరోలా మాట్లాడుతున్నాడని ఆరోపించారు. మల్కాజ్ గిరికి మెట్రో వస్తే ఈటలకు పేరు వస్తుందని కిషన్ రెడ్డి అడ్డుకుంటారని చెప్పడం వార్తల్లో హెడ్ లైన్ గా మారేందుకేనని మండిపడ్డారు. మల్కాజ్ గిరికి మెట్రో వస్తే కిషన్ రెడ్డి చాలా సంతోషిస్తారని అన్నారు. రేవంత్ రెడ్డి ఆ భ్రమలో ఉండాల్సిన అవసరంలేదని చెప్పారు. ఇలాంటి చౌకబారు విమర్శలు రేవంత్ మానుకోవాలన్నారు. రేవంత్ బీజేపీ వ్యక్తా అని వాళ్ల హైకమాండ్‌కు అనుమానం ఉందని అందుకే వాళ్ల మెప్పుకోసం ఇలాంటి కామెంట్లు చేస్తాడని కౌంటర్ ఇచ్చారు.

## మైనర్లపై జరుగుతున్న దాడులపై రేవంత్ రెడ్డి స్పందించాలి: కవిత



**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** ఖమ్మంలో 12 ఏళ్ల చిన్నారిపై అత్యాచారం ఘటనలో నిందితుడిని ఉరి తీసి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. అత్యాచార ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ లో చికిత్స పొందుతున్న చిన్నారిని ఇవాళ కవిత పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఆమె.. మైనర్లపై రోజూ దారుణాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి వెంటనే స్పందించి ఇటువంటి దారుణాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఘటనలో నిందితుడిని ఉరితీసి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అలాగే బాలికకు నెలకు రూ.50 వేల పింఛన్, తల్లిదండ్రులకు ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

## రీ డెవలప్‌మెంట్‌పై ఫోకస్..సర్కారు ప్రత్యేక పాలసీ

మొదటి పేజీ తరువాయి



ప్రపంచ నగరాల్లో అధ్యయనం

ప్రపంచవ్యాప్తంగా అనేక నగరాలు విభిన్న దృష్టి, ప్రమాణాలతో గణనీయమైన పునరాభివృద్ధి చెందుతున్నాయి. వీటిని అధ్యయనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జపాన్‌లోని టోక్యో నగరాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేశారు. హాంబర్గ్‌లోని హాఫెన్‌సిటీ ఒక ముఖ్యమైన పట్టణ పునరుజ్జీవన ప్రాజెక్ట్. దీన్ని ఓడరేవు ఆధారంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. చైనాలోని చాంగ్‌కింగ్ పట్టణం వేగవంతమైన జనాభా పెరుగుదల ఆధారంగా అభివృద్ధి చేశారు. సింగపూర్‌లోని ఫారెస్ట్ సిటీని అభివృద్ధి చేశారు.

హైదరాబాద్‌పై ఫోకస్

హైదరాబాద్ మహానగరంలో జనాభా పెరుగుదల, ఆర్థికాభివృద్ధి, మౌలిక సదుపాలయ కల్పన, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడం, ఆధునీకరణ వంటి అంశాల ఆధారంగా రీ డెవలప్‌మెంట్ ప్లాన్ రూపొందించనున్నారు. ముఖ్యంగా హైదరాబాద్ కోర్ సిటీ లో జనాభా పెరిగిపోయింది. దీంతోపాటు నగరం ప్యాక్ అయింది. కొత్తగా హౌసింగ్ ప్రాజెక్టులు వచ్చే అవకాశం లేదు. పైగా హైదరాబాద్ అంటే ఒకప్పుడు సికింద్రాబాద్, పాతబస్తీ చెప్పుకునేవారు. కానీ మారుతున్న పరిస్థితుల కారణంగా హైదరాబాద్ అంటే హైటెక్ సిటీ, మాదాపూర్ ఒక్క మాటలో చెప్పాలంటే ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) పరిధిలోని ప్రాంతాల గురించి చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్ నగరాన్ని రీ డెవలప్‌మెంట్ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. మురికివాడలను అభివృద్ధి, బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం, కమర్షియల్ ఏరియాల అభివృద్ధి, ఉపాధి అవకాశాలు కల్పించే ప్రాంతాల అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

చార్మినార్ చుట్టూ ప్రాంతాల్లో..

పాతబస్తీలోనూ మెట్రో రైలు ప్రాజెక్టు వేగంగా జరుగుతున్నాయి. మెట్రో రైలు పూర్తయితే పాతబస్తీలో అభివృద్ధి పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు రీ డెవలప్‌మెంట్ ప్రణాళికలో భాగంగా చార్మినార్ చుట్టూ ప్రాంతాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే చార్మినార్ పాదచారుల ప్రాజెక్టు పేరుతో చేపట్టిన పనులు ఏండ్ల తరబడి సాగుతూనే ఉన్నాయి. దీంతో ప్రాజెక్టు వ్యయం పెరుగుతూనే ఉంది. అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయం సమీప ప్రాంతం తరహాలో చార్మినార్ ప్రాంగణాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

చార్మినార్ చుట్టూ ఉన్న లాడ్ బజార్, గుల్జార్ హౌస్, మక్కా మసీదు, సర్దార్ మహాల్ వంటి హెరిటేజ్ బిల్డింగ్స్‌తోపాటు రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టమ్ పూర్తిగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతోపాటు చార్మినార్ చుట్టూ ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతుల్లో ప్రభుత్వం సడలింపు సైతం ఇవ్వాలని నిర్ణయించినట్టు అధికారులు చెబుతున్నారు.

వరంగల్ ఫోర్ట్ చుట్టూ..

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వరంగల్ ఫోర్ట్ ఏరియా చుట్టూ ప్రాంతాలను రీ డెవలప్‌మెంట్ ప్రణాళికలో భాగంగానే అభివృద్ధి చేయనున్నారు. ఫోర్ట్ ఏరియా తో పాటు భద్రకాళి టెంపుల్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్లను సైతం అభివృద్ధి చేయనున్నారు. అయితే ఇప్పటికే వరంగల్ నగరానికి యూసీఎఫ్ నిధులు రూ.4,674 కోట్లు మంజూరు చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే పోర్ట్ చుట్టూ ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు. ఇక్కడ కూడా భవన నిర్మాణ అనుమతుల్లో సడలింపు ఇవ్వనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

## తెలంగాణలో ఈసారి ఖరీఫ్ సాగు డౌన్



**న్యూస్ డెస్క్,13 జూన్ (తెలుగు గళం):** రాష్ట్రంలో ఎప్పుడు లేనివిధంగా ఈ ఖరీఫ్ సీజన్లో పంట సాగు తగ్గుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. ఎల్?నినో ప్రభావం తో రైతులు కూరగాయలు, పండ్లు, తోటల సాగుకు సిద్ధమవుతున్నారు. దీంతో వరిసాగు సగానికి పైగా తగ్గుతుందని భావిస్తోంది. ఈ వానాకాలం సీజన్?లో 134 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయాలని గత నెలలో రైతులకు సూచించి ఆ దిశగా విత్తనాలు, యూరియా అందుబాటులో ఉంచింది. వాతావరణ శాఖ జూలై, ఆగస్టు నెలలో మధ్యంతర కరువు వస్తుందని, ఆరుతడి పంటలే వేయాలని ఆదేశించింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ సంయుక్తంగా గ్రామాల్లో రైతులకు నీటి వినియోగం అధికంగా ఉన్న పంటలు వేయవద్దని తక్కువ నీరు అవసరమున్న పంటలే సాగు చేయాలని ప్రచారం చేస్తున్నాయి. వ్యవసాయ శాఖ ఈ సీజన్?లో 95 లక్షల నుంచి కోటి ఎకరాలు వరకు వివిధ రకాల పంటలు సాగు అంచనా వేస్తుంది.

గత వానాకాలంలో 131 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, ఈసారి వర్షాభావ పరిస్థితులతో 30 లక్షల ఎకరాల్లో సాగు తగ్గుతుందని భావిస్తోంది. ఈసారి సాగు అయ్యే దానిలో 45లక్షల ఎకరాలు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గ చూపుతున్నారు. దీనికి తోడు యూరియా కొరత ఉండటం కూడా ఒక కారణంగా చెప్పవచ్చు. యాప్? తీసుకరావడంతో బుకింగ్ ?చేసుకోవడం రైతులకు కష్టంగా మారింది. డిగ్రీ చదువుకున్న యువత కనిపిస్తే వారి ఇంటి వద్ద గంటల తరబడి వేచి చూసి యూరియా బుకింగ్? చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దీంతో చాలా మంది రైతులు గతంలో కొనుగోలు చేసిన దానికంటే ఈసారి యూరియా వాడకం తగ్గిస్తున్నారు. పంట పండింతే చాలు అని అప్పులు చేయకుండా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

ఆరు తడితోనే ఆదాయం..

రైతులు కూరగాయలు, పండ్లు, నువ్వులు, పొద్దు తిరుగుడు, కుసుమలు, శనగలు పంటలు వేస్తే అధిక ఆదాయం వస్తోందని ఉద్యాన శాఖ పేర్కొంటుంది. ఈ ఏడాది నుంచి మార్కెట్?సౌకర్యాలు మెరుగుపరుచుతున్నట్టు, చేనులో నుంచి తీసుకొచ్చి పంట అమ్మేందుకు ఇబ్బందులు లేకుండా ప్రయత్నాలు చేస్తుంది. మొన్నటి వరకు రైతులు కూరగాయలు, పండ్లు మార్కెట్?కు తీసుకొచ్చినప్పడే ధరల పడిపోతాయి. అదే దళారులు కొనుగోలు చేసి సరుకులు రెండింతలు ధరల వస్తోంది. ఈసారి అలాంటి పరిస్థితులు రాకుండా చర్యలు చేపడుతోంది.

ఈ వానాకాలంలో వ్యవసాయ శాఖ వేరుశనగ 26 వేల ఎకరాలు, నువ్వులు 650 ఎకరాలు, పొద్దు తిరుగుడు 150 ఎకరాలు, కుసుమలు 3,600 ఎకరాల్లో సాగు కావచ్చని గణాంకాలు వేస్తోంది. జొన్నలు 39 వేల ఎకరాలు, సజ్జలు 1200 ఎకరాల్లోనే సాగు అయ్యే అవకాశం ఉందని భావిస్తోంది. మొక్కజొన్న 5.40 లక్షల ఎకరాలు, కంది పంట 5.10 లక్షల ఎకరాల్లో వేయాలని టార్గెట్ పెట్టుకుంది. మిర్చి 1.90 లక్షల ఎకరాలు, సోయాబీన్? 4.10 లక్షల ఎకరాలు, పెసర్లు 65 వేల ఎకరాలు. మినుములు 28 ఎకరాలు రైతులు సాగు చేసేలా ప్రయత్నాలు చేస్తోంది.

కౌలు రైతులు దూరం

ఈ ఏడాదిలో యూరియా ధరలు భారీగా పెరిగాయి. విత్తనాలు ధరలు భగ్గమంటున్నాయి. భూమి కలిగిన పట్టాదారులు ఏడాదికి చెల్లించే కౌలు కూడా పెంచారు. గత ఐదారేళ్లుగా కూలీల కొరత వేధిస్తోంది. ఇన్ని సమస్యల మధ్య భూమి కౌలుకు తీసుకోని అప్పులు చేసి పంట పండించడం కంటే పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లడం ఉత్తమమనే ఆలోచనలో కౌలు రైతులు ఉన్నారు. రేవంత్ ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా, క్రాప్ రుణాలు, ప్రకృత్తి విపత్తులకు నష్టం జరిగితే ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వ్యవసాయానికి మొగ్గు చూపినట్టు రైతు సంఘాలు చెబుతున్నాయి.

వరి పంట సాగు చేస్తే కౌలు, ఎరువులు, దుక్కులు దున్నడం, వరినాట్లకు కూలీలు, వరి కోత, కేంద్రాలకు ధాన్యం తరలింపు వంటి ఖర్చులు ఒక ఎకరానికి రూ. 60 వేలు వస్తుంది. అదే విధంగా పత్తి పంట సాగు చేస్తే కౌలు ధర ఎకరానికి రూ.20 వేలు, ట్రాక్టర్‌తో దున్నకాలు రూ. 5వేలు, విత్తనాలు, కలుపు కూలీలకు రూ.6 వేలు, గింజలకు రూ. 2 వేలు, ఎరువులు చల్లే కూలీలకు రూ.6వేలు, రసాయనిక ఎరువులు రూ.10 వేలు, పురుగు మందులు రూ. 8 వేలు, పత్తి తీయడానికి రూ.15 వేలు ఇవే కాకుండా ఇతర ఖర్చులతో రూ.81 వేలు వస్తోందని అన్నదాతలు వెల్లడించారు.

# గిరిజన నిరుద్యోగ యువతకు ఐటిడీఏ శుభవార్త..

### ఉచిత శిక్షణతో ఉపాధి అవకాశాలు




**భద్రాచలం, జూన్ 13 (తెలుగు గళం న్యూస్)**

భద్రాచలం ఐటిడీఏ ఆధ్వర్యంలోని వైటీసీ శిక్షణా కేంద్రంలో గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. 18 నుండి 33 సంవత్సరాల వయస్సు గల ఎస్టీ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ప్రస్తుతం కంప్యూటర్ కోర్సులో ఒక బ్యాచ్, బ్యూటీషియన్ కోర్సులో రెండు బ్యాచ్‌లకు మాత్రమే సీట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు.శిక్షణ పొందే అభ్యర్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజేసి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు.ఆసక్తి గల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ నెల 20వ తేదీలోగా తమ సామగ్రితో నేరుగా వైటీసీ శిక్షణా కేంద్రానికి చేరుకుని రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని ఐటిడీఏ ప్రాజెక్టు అధికారి పేర్కొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం.. పీఎం పోషణ పథకంపై ధర్మసాగర్‌లో ప్రత్యేక శిక్షణ



**ధర్మసాగర్, జూన్ 13 (తెలుగు గళం):**

పాఠశాల విద్యార్థులకు పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన ఆరోగ్యకరమైన మధ్యాహ్న భోజనం అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం పోషణ (మధ్యాహ్న భోజన) పథకంపై ధర్మసాగర్ మండలంలో ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ధర్మసాగర్ బాలుర జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రతి పాఠశాల నుండి ఒక కుక్-కమ్-హెల్పర్ పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ధర్మసాగర్ మండల విద్యాధికారి డా. రామ్‌ధన్ మాట్లాడుతూ, విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి నాణ్యమైన మధ్యాహ్న భోజనం అత్యంత కీలకమని పేర్కొన్నారు.భోజన తయారీ ప్రక్రియలో పరిశుభ్రత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని,ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.జెడ్పీహెచ్ఎస్ బాలుర ధర్మసాగర్ స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కె.బి. ధర్మప్రకాశ్ శిక్షణ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తూ,మధ్యాహ్న భోజన తయారీలో పాటించాల్సిన "చేయవలసినవి -- చేయకూడనివి" అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.ఆహార భద్రత, పరిశుభ్రత, పోషక విలువలు, వంటశాల నిర్వహణ వంటి అంశాలపై పాల్గొనేవారికి వివరించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ బాలికల ధర్మసాగర్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు గణేష్, జెడ్పీహెచ్ఎస్ దేవునూర్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి,స్కూల్ కాంప్లెక్స్ సహాయ కార్యదర్శి స్వర్ణలత పాల్గొన్నారు.స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కుక్-కమ్-హెల్పర్లు శిక్షణలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పోకల శ్రీనివాస్ ఏకగ్రీవ ఎన్నిక



**తెలుగు గళం న్యూస్ భద్రాచలం**

భద్రాచలంలోని ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా జరిగాయి. సమావేశంలో పాల్గొన్న 20 మంది ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు రెండో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

గౌరవ అధ్యక్షుడు కుప్పాల నాగరాజు, గౌరవ సలహాదారు పూనెం ప్రదీప్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పోకల శ్రీనివాస్ (వి6 న్యూస్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా చెట్టి జస్వంత్ (99 టీవీ బ్యూరో), కోశాధికారిగా లంకా రాజేష్ (రాజ్ న్యూస్), ఉపాధ్యక్షుడిగా తమ్మల్ల రాజేష్ (వై7 న్యూస్ బ్యూరో), సహాయ కార్యదర్శిగా పోలిశెట్టి రాజు (స్వతంత్ర టీవీ) ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా గత కమిటీ సభ్యులు తమ పదవీకాలంలో సహకరించిన మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ మీడియా ప్రతినిధులందరినీ సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

అలాగే ప్రజలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను మీడియా ప్రెస్ క్లబ్‌కు తెలియజేయాలని, క్లబ్ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటుందని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని వారు పేర్కొన్నారు.

## సర్కారు బడికి సరికొత్త శోభ.. స్వయంగా రంగులు వేసిన సర్పంచ్ రేణుక



**ధర్మసాగర్, జూన్ 13 (తెలుగు గళం):**

సర్కారు పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యార్థులకు ఆకర్షణీయమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో ముప్పారం గ్రామ సర్పంచ్ గుంటిపల్లి రేణుక ఆదర్శప్రాయంగా ముందుకు వచ్చారు.గ్రామంలోని ఉప్పర ప్రాథమిక పాఠశాలను స్వయంగా శుభ్రపరచి,రంగులు వేయడంలో పాల్గొని అందరి ప్రశంసలు అందుకున్నారు.పాఠశాలల పునఃప్రారంభం నేపథ్యంలో గత వారం రోజులుగా ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్ రేణుక, శనివారం పాఠశాలలోని 10 గదులకు కొత్తగా రంగులు వేయించారు.విద్యార్థులను ఆకట్టుకునే విధంగా పాఠశాల భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు స్వయంగా రంగులు వేస్తూ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శితో కలిసి సేవలందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుక మాట్లాడుతూ, సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు గులాబీ పుష్పాలు అందించి ఘనంగా స్వాగతం పలుకుతామని తెలిపారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలతో పాటు ఇతర మౌలిక వసతులను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.సర్కారు పాఠశాలల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు అందరూ భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాళ్లపల్లి కుమారస్వామి గౌడ్,వార్డు సభ్యులు శ్వేత సాగర్,శోభా మల్లయ్య,గ్రామ కార్యదర్శి ఆకారం సురేష్,పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్ రెడ్డి,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## దుబ్బ శ్రీనివాస్ ను పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



**తెలుగు గళం న్యూస్ ,వరంగల్ బ్యూరో/జూన్ 13**

వరంగల్ నగరంలోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు,ఆర్యవైశ్య మహాసభ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ ని మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు శ్రీనివాస్ తల్లి దుబ్బ వీరలక్ష్మి ఇటీవల మృతి చెందగా శనివారం ఎర్రబెల్లి దయాకర్ రావు కాశిబుగ్గ వివేకానంద కాలనీలోని శ్రీనివాస్ నివాసానికి చేరుకొని వీరలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం శ్రీనివాస్ ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పర్వతగిరి సొసైటీ చైర్మన్ మనోజ్ గౌడ్ బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల యాదగిరి బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కేతిరి రాజశేఖర్ పర్వతగిరి మండల పార్టీ అధ్యక్షుడు రాజేశ్వర రావు 14 డివిజన్ నాయకులు పత్రి సుభాష్, పత్రి రాజా పోషాలు, పొడిశెట్టి అశోక చారి, పేకటనోజు వీరాచారి, పొన్నం ప్రభాకర్, మండల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి మండల కేంద్రంలో తక్షణమే విద్యుత్ ఏ.ఈ ని నియమించాలి



**తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / జూన్ 13 :**

పర్వతగిరి మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పోకల శంకర్ మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి ఏజీఎల్ పర్వతగిరి విద్యుత్తు సరఫరా లేనందున పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దున్నిన, దున్నుకోవలసిన నారు మళ్లకు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలో విద్యుత్ ఏ.ఈ లేనందున, అన్ని సమస్యలు ఏడీ తిరుపతి తో చెప్పుకోవాల్సి వస్తుంది. జిల్లా విద్యుత్ ఉన్నతాధికారులు మండల కేంద్రంలో తక్షణమే విద్యుత్ ఏ.ఈ ని నియమించాలని రైతులు కోరుతున్నారని పోకల శంకర్ అన్నారు . రైతులకు కొత్త లైన్లు వేసేవి అలాగే ఉండిపోయినవి, వర్షాకాలం మొదలు కావస్తుంది. సంబంధిత విద్యుత్ అధికారులు వర్షాకాలంలో రైతులకు ఇబ్బంది లేకుండా తక్షణమే అన్ని ఏర్పాట్లు చూడాలని కోరుతున్నారు. సింగిల్ ఫేజ్ లో ఉన్న మోటార్లకు తక్షణమే త్రీ ఫేజ్ సౌకర్యం కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఐఎన్టియుసి ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా కెంబసర్తి నాగేశ్వరరావు నియామకం




**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం / జూన్ 13, ఖమ్మం జిల్లా :** ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఫెడరేషన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులుగా కెంబసర్తి నాగేశ్వరరావు గారిని నియమిస్తూ ఐఎన్టియుసి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బుధ్ధారం మురహరి హైదరాబాద్ లోని ఐఎన్టియుసి ఫెడరేషన్ కార్యాలయంలో నియామక పత్రాని కెంబసర్తి నాగేశ్వరరావు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కెంబసర్తి నాగేశ్వరరావు మాట్లాడుతూ అసంఘిటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వర్తించి కార్మికులకు ఒక బ్రహ్మాస్త్రంగా అండగా నిలబడి కార్మికులకు కొరకు నిరంతరం కృషి చేస్తొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బట్టిని సుమన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొహీర్ లింగ రెడ్డి ,తదితరులు పాల్గొన్నారు.

# గార్ల లో టియుడబ్ల్యూజే (ఐజేయు) క్లీన్ స్వీప్...

### సందడిగా సాగిన సభ్యత్వ నమోదు కార్యక్రమం...

### సభ్యత్వాలు స్వీకరించిన మండలంలోని జర్నలిస్ట్ లు...



**తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా.**

గార్ల మండలానికి చెందిన జర్నలిస్ట్ లు అందరూ ఒకే మాట మీద, టియుడబ్ల్యూజే(ఐజేయు) కొనసాగేందుకు నిర్ణయించుకున్నందుకు ధన్యవాదాలు తెలిపిన టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్.యూనియన్ పట్ల, యూనియన్ నాయకత్వం పట్ల నమ్మకాన్ని., మీ..ఆదరణను, అభిమానాన్ని కలకాలం నిలుపుకునేందుకు కృషి చేస్తామని మాట ఇచ్చిన టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్.గార్ల మండల అధ్యక్షుడు నేలం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ..సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న టియుడబ్ల్యూజే(ఐజేయు) మహబూబాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, యూనియన్ జిల్లానాయకులు బుడాన్, ప్రశాంత్, రాము, మండల ప్రధానకార్యదర్శి రూపన్ శంకర్, పలువురు సీనియర్ జర్నలిస్ట్ లు, మండల బాధ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ, అరటిపండ్లు, కూల్ డ్రింక్స్ పంపిణీ చేసిన తాటి

### కూలీలకు అండగా నిలిచిన తాటి వెంకటేశ్వర్లు

### ఉపాధి కూలీలకు రూ.500 వేతనం ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్

**ములకలపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలుగు గళం న్యూస్**

పాతూరు, గుర్రాలగుంట గ్రామాల్లో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు బూర్గంపహాడ్, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు మజ్జిగ ప్యాకెట్లు, అరటిపండ్లు, కూల్‌డ్రింక్స్ పంపిణీ చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు ఉపశమనం కలిగించేందుకు స్వయంగా వాటిని అందజేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

కూలీలతో మాట్లాడిన తాటి వెంకటేశ్వర్లు ఉపాధి పనుల నిర్వహణ, వేతనాల చెల్లింపులు, పని దినాలపై ఆరా తీశారు. అలాగే గ్రామ సమస్యలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

"ఎండాకాలంలో ఉపాధి కూలీలు పడుతున్న కష్టం చూస్తుంటే బాధగా ఉంది. వారి మెడికల్ కిట్ మరియు టెంట్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేశాం. ప్రస్తుతం కూలీలకు సరిపడా పని దినాలు, తగిన వేతనాలు అందడం లేదు. ఉపాధి హామీ కూలీలకు రోజుకు కనీసం రూ.500 వేతనం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా ధర్మ, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, పెద్దరాపు నాగరాజు, తాటి రవి, సోయం చిన్నారి ఊకే అశోక్, సోడే శ్రీనివాస్, బొర్రా సుధాకర్ భూక్యా నందా. అంగోత్ భద్రు భూక్యా రవి అజి?మీరా నాగరాజు. తెల్లం నరసింహారావు. భూక్యా ధర్మ. సడియం అశోక్. సోడే సింగయ్య. అంగోత్ జోహాలాలు. అంగోత్ పెద్ద భద్రు. తాటి సాగర్.తేజావత్ సూర్యం భూక్యా వీరభద్రం. ఇర్ప నాగ సిధార్థ. తాటి రామకృష్ణ. పర్సక ప్రసాద్. గుగులోత్ యాకు. వంకుడోత్ శివ. భూక్యా నాగరాజుభూక్యా చిన్న భద్రు మరియు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు..



# సిరులు విరజిల్లిన తెలంగాణ..! నాటి సొగసేది..

**పంచ కర్మలకు ప్రాధాన్యత పెంచండి**
**కళాకారుల త్యాగాలకు విలువనివ్వండి**
**భగవంతుడొక్కడే... అన్న సత్యత్వంతో సమైక్యమౌదాం**
**మతాలు వేరైనా మానవత్వం ఒక్కటేనని చాటుదాం**
**-- విశ్వ కళావిరాట్ డాక్టర్ శాంతి కృష్ణ ఆచార్య**




**తెలుగు గళం న్యూస్, పర్వతగిరి / జూన్ 13 :**

త్రిలింగ అన్న పదములో నుంచి పుట్టిన తెలుగు "దేశ భాష లందు తెలుగు లెస్స" అన్న స్థాయిలో కీర్తించబడిందని, తెలంగాణ ప్రాంతంలోని ఏకశిలా నగరాన్ని (ఓరుగల్లును) రాజధానిగా చేసుకుని పాలించిన కాకతీయులు చరిత్రకారులై భావితరాల నవఒరవడికి నాంది పలికారని పర్వతగిరి మండలంలోని చౌటపల్లి గ్రామానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, విశ్వ కళావిరాట్ డాక్టర్ శాంతి కృష్ణ ఆచార్య అన్నారు.హనుమకొండ టిఎన్జిఓయస్ భవన్ లో శనివారం తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపకులు పోలోజు రాజ్ కుమార్ నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ జాతీయ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమానికి తెలుగు వెలుగు సాహితీ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ జర్నలిస్ట్ అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు డా. పొడి శెట్టి విష్ణువర్ధన్ అధ్యక్షతవహించిన ఈ కార్యక్రమానికి డా. శాంతి కృష్ణ ఆచార్య ముఖ్య అతిధిగా విచ్చే ప్రసంగించారు.ఈ సందర్భంగా డా. ఆచార్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమంలో ప్రాణాలను పణంగా పెట్టి ముందున్నది విశ్వకర్మలేనని, ఉద్యమాన్ని ఉధృతం చేసి తెలంగాణ ప్రజలను సమైక్యపరిచింది కళాకారులేనని కానీ ఈ ఇరువురికి రాష్ట్రంలో ఆదరణ, ప్రోత్సాహం కరువైందన్నారు, పంచకర్మలైన విశ్వకర్మలకు కాకతీయులు సముచితమైన ప్రత్యేక స్థానాన్ని కల్పించారని, ప్రపంచవ్యాప్తంగా విశ్వకర్మలు శిల్పకళలతో నిర్మించిన అన్ని దేవాలయాలు, శిల్ప కళాఖండాలే నేడు సనాతన ధర్మానికి, సనాతన సంస్కృతికి సజీవ సాక్షాలుగా నిలుస్తున్నాయన్నారు.నాడు సిరులు విరజిల్లుతూ.... కళలకు ఖానాచిగా ఉన్న తెలంగాణ నేడు విశ్వకర్మలకు, కళాకారులకు సరియైన గుర్తింపు నివ్వక విలవిలలాడుతుందన్నారు, ప్రపంచం ఎంత ఆధునీకరణమైన కళాకారుల ద్వారానే ప్రజల్లో చైతన్యం తీసుకురాగలుగుతామన్నారు ఇది ప్రభుత్వాలు విస్మరించకుండా కళాకారులకు సరైన విలువలను ఇచ్చి వారి సేవలను జన చైతన్యానికి వినియోగించుకోవాలని అలాంటి ప్రభుత్వాలే చరిత్రలో స్థిరంగా మిగులుతాయన్నారు

ప్రపంచంలో ఎన్ని దేశాలు ఉన్నప్పటికీ భారతీయ సనాతన ధర్మమే గొప్పదని, మన భూమిపై మానవ మనుగడ ఏర్పడి సుమారు లక్ష సంవత్సరాలు అయినప్పటికీ మానవుడికి నాగరికతను నేర్పి మానవ మనుగడకు మార్గదర్శక మైనది భారతీయ సంస్కృతికి చెందిన విశ్వకర్మ జాతీయులు మాత్రమేనని, పంచ వేదములు పుట్టిన నేల కూడా భారతదేశమేనని కనుక మన జాతిని, మన జాతీయులను విస్మరించరాదని, ప్రపంచంలో ఎన్ని మతాలు ఎన్ని జాతులు ఉన్నప్పటికీ మానవత్వం ఒకటేనని, భగవంతుడు ఒక్కడే విరాట్ విశ్వకర్మ పరమాత్మ అన్న వాస్తవికసత్యాన్ని విశ్వవ్యాప్తం గావించాలని, అన్ని మతాల సారాంశం కూడా ఇదే సత్యత్వాన్ని చాటుతున్నాయని డా. ఆచార్య అన్నారు.తెలుగు వెలుగు సాహితీ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పోలోజు రాజ్ కుమార్ మన దేశ సమగ్ర సమైక్యతను చాటుతూ వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందిస్తున్న మహోన్నత వ్యక్తులను గుర్తించి వారికి జాతీయస్థాయిలో పురస్కారాలు అందజేయడం ద్వారా వారిలో మరింత చైతన్యం కలుగుతుందని తద్వారా వారు చేస్తున్న సేవలు భావితరాలకు మార్గదర్శకమై మానవత్వం మరింత వికసిస్తుందని డా. ఆచార్య అన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీ జగత్మునీశ్వర స్వామి ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ బసవత్తుల రాజమౌళీశ్వర స్వామి వారు జ్యోతి ప్రజ్వలన గావించగా తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ చైర్మన్ పోలోజు రాజ్ కుమరాచార్యులు, సభాధ్యక్షులు వహించిన డా. పొడి శెట్టి విష్ణువర్ధన్ ఆచార్య, మరో ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. వనపర్తి పద్మావతి, తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ మాతృ సంఘం ప్రధాన కార్యదర్శి చెల్లేటి కృష్ణమాచారి, తెలుగు వెలుగు జాతీయ ప్రధాన కార్యదర్శి డా. వలభోజ మోహన్ రావు, వరంగల్ ఉమ్మడి జిల్లా విఓపిఏ అధ్యక్షులు శ్రీరామోజు నాగరాజారావు, తారక కమ్మవారి కళ్యాణ వేదిక వ్యవస్థాపకులు మన్నె నాగమల్లేశ్వరి, భద్రకాళి దేవాలయ పూర్వ ఈవో శేషు భారతి, కాసుల కిరణ్ కుమార్, వేముల తిరుపతిరెడ్డి, వేములవాడ రాధిక, పెద్దపల్లి స్పందన, సంఘ శ్రీధర్, అడ్లూరి వెంకటేశ్వర్లు, బాణాల రాజు, జొనాగోని యాదగిరి గౌడ్ తో పాటు దేశ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖులు ప్రజలు హాజరయ్యారు.ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్తర దక్షిణ రాష్ట్రాల నుండి సుమారు 120 మంది వివిధ రంగాలలో విశిష్ట సేవలు అందించిన వారికి జాతీయ గౌరవ పురస్కారాలతో సత్కరించారు.

# నేటితో ముగిసిన వేసవి క్రికెట్ క్యాంప్



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ప్రతినిధి, జూన్ 13**

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం చిల్పూర్ మండలం వంగాలపల్లి గ్రామాల్లో గత 35 రోజుల నుండి హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ సౌజన్యంతో జిల్లా క్రికెట్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని 8 సెంటర్స్ ఆయన కాకతీయ మెడికల్ కాలేజీ గ్రౌండ్, వంగాలపల్లి డబ్ల్యూడీసిఏ గ్రౌండ్ , పరకాల, భూపాలపల్లి, మహబూబాద్, ములుగు, పెద్దాపూర్,నర్సంపేట సెంటర్లలో నిర్వహించిన ఉచిత వేసవి క్రికెట్ క్యాంప్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి మాట్లాడుతూ..రాబోయే రోజుల్లో క్రీడామైదానాలే దేశ ప్రగతికి నాంది కానున్నాయని, చెడు వ్యసనాలకి దూరంగా కావాలి అంటే యువత ఇలాంటి క్యాంపులు పాల్గొనడం వలన మంచి దారిలో వెళ్ళవచ్చుని క్రీడలతో పాటు విద్యలో కూడా రాణించే అవకాశం ఉంది అని తెలుపుతూ, క్యాంపులో పాల్గొన్న సుమారు 500 మంది క్రీడాకారులు ప్రతి ఒక్కరికి అభినందలు తెలియచేశారు. రానున్న రోజుల్లో వరంగల్ జిల్లాలో అంతర్జాతీయ స్టేడియం కల నెరవేరనున్న నేపథ్యంలో ఈ క్యాంపులో పాల్గొన్న క్రీడాకారులకు అంతర్జాతీయ ప్రాతినిధ్యం అనుభవం కల్పించేలా తన తరుపున శ్రీలంక క్రికెట్ టూర్ స్పాన్సర్షిప్ ఇప్పిస్తానని సభాముఖంగా ప్రకటించారు.జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ టీజీ 20 లో జిల్లా నుండి 4 క్రికెటర్లు వేలంలో అమ్ముడు పోవడంతో రానున్న రోజుల్లో జిల్లా క్రికెట్ ప్రగతి మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలుపుతూ ఈ సమ్మర్ క్యాంప్ లను రెగ్యులర్ క్యాంప్ గా కొనసాగించేందుకు తను రానున్న రోజుల్లో హెచ్ సీఏ కి ప్రతిపాదనలు చేయనున్నట్టు తెలుపుతూ క్రీడాకారులకు డబ్ల్యూడీసిఏ అన్ని విదాలుగా తోడ్పాటు ఇస్తున్నట్టు తెలిపారు.ఈ కార్యక్రమానికి సభ అధ్యక్షులుగా పెద్ది ప్రవీణ్ గౌడ్ వ్యవహరించగా, మాజీ కార్యదర్శి మర్నేని ఉదయభాను, జిల్లా ఉపాధ్యక్షులు సదా శివ్, తోట రాము, కార్య వర్గా సభ్యులు అభినవ వినయ్, సెలెక్షన్ కమిటీ చైర్మెన్ పుల్లూరు శ్రీనివాస్ గౌడ్, అజయ్ సారథి, సిరిమల్లె శ్రీనివాస్, శంకర్, కోచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గారు ఒక్కసారి ఈ రోడ్డు కి రండి

**గిరిజన ఆశ్రమ పాఠశాలకి, ఎమ్మెల్యే కానీ, అధికారులు కానీ ఈ రోడ్డుపై శ్రద్ధ లేదు**
**మా ఓట్లు కావాలి, మాకు రోడ్ వేయారు**
**మాకు రోడ్డు వేయండి మహా ప్రభు అని సిపిఎం నాయకులు కు విన్నవించుకోన్న ప్రజలు**




**భూమండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా , తెలుగు గళం న్యూస్**

పినపాక నుండి పాల్వంచకు వెళ్లి రోడ్డు ఉప్పు సాక, జిన్నిగట్ట ఒడ్డుగూడెం గ్రామానికి పోయే రోడ్డు దారుణంగా చాలా ప్రమాదంగా తయారయింది

బూర్గంపాడు మండలం పినపాక పట్టి నగర్ గ్రామం నుండి జిన్నిగట్టు రోడ్డు వరకు కొన్ని సంవత్సరాలు బట్టి ఆ రోడ్డు దారుణంగా తయారైంది అని

సిపిఎం పార్టీ బూర్గంపాడు మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు అన్నారు.గ్రామస్తులతో హా రోడ్ పై రాస్తారోకో చేయటం జరిగింది అని గ్రామ సభల్లో ప్రజలకు రోడ్డు శాంక్షన్ అయింది అని ప్రతిసారి గ్రామ సభలో చెప్తుంటారు.కానీ గ్రామసభ తీర్మానం చేస్తే ఇన్ని సంవత్సరాలు బట్టి రోడ్ వేయకుండా ఎందుకు ఉంటుంది అని అన్నారు. కాలం మారుతుంది కాలంతో పాటు ప్రజాప్రతినిధులు అధికారులు మారుతున్నారు గాని మా రోడ్డు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.ఉప్పుసాక గ్రామంలో 300 మంది గిరిజన ఆదివాసి విద్యార్థుల ఆశ్రమ పాఠశాల ఉంది అక్కడ వందలాది మంది పిల్లలు చదువుకుంటున్నారు.గిరిజన హాస్టల్ అక్కడికి తల్లిదండ్రులతో సహా వస్తుంటారు పోతుంటారు ఆ రోడ్లో ప్రమాదాలు కూడా జరిగాయి రాత్రులు గోతుల్లో పడి కాళ్లు చేతులు కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయి.వాళ్ళు రీసెంట్గా రెంటాల శ్రీను ఆ రోడ్లో గోతిలో పడి మోకాళ్లు చేతులు కూడా కొట్టకపోయిన పరిస్థితి ఉంది.పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆ రోడ్లు అనేకసార్లు తిరుగుతుంటారు అట్లనే ఐటీడీఏ పీవో ఆశ్రమ పాఠశాల గిరిజన హాస్టల్ కు అనేక సార్లు వస్తుంటారు.అయినా ఆ రోడ్డుని చూసి చూడనట్టుగా పట్టించుకోకుండా వదిలేయటం చాలా దారుణమని సిపిఎం పార్టీ డిమాండ్ చేస్తుంది.వెంటనే ఆ రోడ్డుని ఆ గ్రామ ప్రజలకు ఆశ్రమ పాఠశాలకి ఇబ్బంది లేకుండా బిటి రోడ్డు వేపించాలని సుమారుగా ఏడు కిలోమీటర్లు దూరం ఉంటుంది ప్రజలకు ఇబ్బంది ప్రమాదాలు జరగకుండా వెంటనే ఆ రోడ్డుని

ఆ ఎస్టీ గ్రామాలకు రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కురుస తిరపతయ్య, బోల్లి శ్రీను, రవి కుమార్, ఎడమ వెంకటేశ్వర్లు, సోడే లక్ష్మి ,కురస ఎర్రమ్మ, తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నూతన ఉపాధ్యక్షుడిగా బత్తుల సతీష్ గౌడ్ ఎంపిక



**తెలుగు గళం, ఉప్పుగూడ, భాగ్యనగర్:** ఉప్పుగూడలోని శ్రీ మహంకాళి మరకతలింగేశ్వర స్వామి దేవాలయంలో భాగ్యనగర్ ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నూతన ఉపాధ్యక్షులు-2 గా బత్తుల సతీష్ గౌడ్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాబోయే 2026 ఆషాఢమాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని, ఆలయ అధ్యక్షులు జనగామ మధుసూదన్ గౌడ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బోనాల ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, ఈ సంవత్సరానికి గానూ కమిటీ సభ్యుడిగా ఉన్న బత్తుల సతీష్ గౌడ్‌ను ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఉపాధ్యక్షులు--2 పదవికి ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది.

ఈ సందర్భంగా బత్తుల సతీష్ గౌడ్ మాట్లాడుతూ "నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన ఆలయ పెద్దలకు, కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు. రాబోయే ఆషాఢమాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించడానికి నా శాయశక్తులా కృషి చేస్తాను." సతీష్ గౌడ్ ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆలయ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు ఇతర కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపును విజయవంతం చేయడానికి కమిటీ సభ్యులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో శ్రీ మహంకాళి మరకత లింగేశ్వర స్వామి దేవాలయ నిర్వాహకులు, ముఖ్య నేతలు మరియు ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## శంషాబాద్ కిడ్ జీ స్కూల్‌లో ఘనంగా మ్యాజిక్ షో

**తెలుగు గళం,శంషాబాద్, జూన్ 13:** విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను పెంపొందించే దిశగా శంషాబాద్‌లోని కిడ్ జీ స్కూల్ లో శనివారం వినోదాత్మక 'మ్యాజిక్ షో' కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. చిన్నారి విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసాన్ని, విజ్ఞానాన్ని అందించే అద్భుత లక్ష్యంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మ్యాజిషియన్ ప్రదర్శించిన పలు విచిత్ర విన్యాసాలు, ట్రిక్స్ అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. మ్యాజిక్ షోను కళ్లప్పగించి చూసిన విద్యార్థులతో పాటు, కార్యక్రమానికి హాజరైన తల్లిదండ్రులు కూడా మ్యాజిషియన్ ప్రతిభకు ముగ్ధులై చప్పట్లతో అభినందించారు. ఈ సందర్భంగా రావుల గణేష్, కిడ్ జీ స్కూల్ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ "ఇలాంటి వినూత్న ప్రదర్శనలు కేవలం వినోదం కోసమే కాకుండా పిల్లల్లో ఊహాశక్తిని, ఆలోచనా విధానాన్ని మరియు ఏకాగ్రతను అద్భుతంగా పెంపొందిస్తాయి. భవిష్యత్తులో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి మరిన్ని సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహిస్తాం." ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొని ప్రదర్శనను విజయవంతం చేశారు.

## పిట్లం మండలంలో విషాదం

**ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య**



**తెలుగు గళం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూన్ 13:** కామారెడ్డి జిల్లా పిట్లం మండలం చిన్న కొడప్గల్ గ్రామ శివారులో ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, టిక్యా నాయక్ తండాకు చెందిన మెగావత్ శ్రీకాంత్ (27) కుటుంబంతో కలిసి హైదరాబాద్ హఫీజ్‌పేట్‌లో నివసిస్తూ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు.

ఈ నెల 10వ తేదీ రాత్రి 7.30 గంటల సమయంలో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడిన శ్రీకాంత్, అల్విన్ క్రాస్‌రోడ్స్ వద్ద ఉన్నానని, ఇంటికి వస్తానని తెలిపాడు. అనంతరం రాత్రి 10 గంటల సమయంలో ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌తో పాటు బంధువుల వద్ద గాలించినా ఆచూకీ లభించలేదు. శనివారం చిన్న కొడప్గల్ శివారులోని సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ సమీపంలో అతని ఆటో కనిపించగా, దానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో వేప చెట్టుకు ఉరేసుకుని మృతదేహంగా కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి మెగావత్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పిట్లం ఎస్సై ఆంజనేయులు తెలిపారు. చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. కాగా, మృతుడిపై హైదరాబాద్‌లోని నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదై ఉండగా, నెల రోజుల క్రితమే జైలు నుంచి విడుదలైనట్లు సమాచారం. పోలీసులు అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు పిట్లం ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.